క్లుప్తంగా

ఫోర్త్‌టౌన్ పీఎస్‌కు టెన్త్ ప్రశ్న పత్రాలు

సీతమ్మధార: ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సెట్-1 ప్రశ్న పత్రాలు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాయి. వాటిని చీఫ్ సూపరింటిండెంట్లు, స్కూల్ అసిస్టెంట్లు పరిశీలించి స్టేషన్‌లో భద్రపరిచారు. ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు నాలుగు సెంటర్లు, ద్వారకా పోలీస్ స్టేషన్‌కు నాలుగు సెంటర్లకు సంబంధించిన పత్రాలు వచ్చాయి. గురువారం సెట్-2 పరీక్షా పత్రాలు రానున్నట్లు ఎస్‌ఎంసీ హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుడికి సత్కారం



రామారావు దంపతులను సత్కరిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సుదీర్ఘ కాలం పాటు పారిశుధ్య కార్మికుడిగా సేవలందించిన బంగారు రామారావుకు సహచర సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. నిస్వార్థ సేవలకు గుర్తింపుగా తోటి కార్మికులు సత్కరించారు. జీవీఎంసీ 25వ వార్డులో బంగారు రామారావు 34 ఏళ్ల పాటు సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేశాడు. గురుద్వారా కూడలి సమీపంలోని వెన్నెల ఫంక్షన్ హాల్‌లో బుధవారం సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ రామారావు దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, శానిటేషన్ సెక్రటరీలు తేజ, నాగరాజు, సారిపిల్లి గంగరాజు, అప్పన్న, సన్నీ, గుడివాడ గౌరినాయుడు, అప్పలరాజు, రాము, ఈశ్వరరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవి అనే పదాన్ని విశ్లేషించి, కవితా వస్తువు పదవిన్యాసాలతో అర్థం, భావం ఉన్నప్పుడే కవితకు సార్థకత ఉంటుందని తెలిపారు. కవితా విశ్లేషకుడు కె.జి.వేణు కబీర్‌దాసు గురించి సభకు పరిచయం చేశారు. కబీర్‌దాసును భక్తాగ్రగణ్యుడిగా వివరించారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ మంచి కవిత్వ లక్షణాలను వివరించారు. కె.వి.ఎస్.మూర్తి కవిత్వ భావనలు బోధించారు. విజయ్‌కుమార్, సిహెచ్.చినసూర్యనారాయణ, రామతాత, కె.వి.రమణ, సూర్యకళ, డి.ఎస్.కుమార్, రామ్‌కుమార్, బి.ఎస్.మూర్తి, ఎ.ప్రసాద్, ప్రసన్నకుమారి, భాగ్యశ్రీ, శివ కవితలు చదివి వినిపించారు.

పేరుకుపోయిన చెత్త



ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో పార్కు వద్ద చెత్తకుప్పలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార రైతుబజార్ రోడ్డు, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డు ప్రాంతాల్లో చెత్త తొలగించకపోవడంతో పేరుకుపోతోందని స్థానికులు చెబుతున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల చెత్తను తీసుకొచ్చి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డులోని పార్కు వద్ద పడేయడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

ఆలయాలకు శివరాత్రి శోభ

- వేడుకలకు ముస్తాబైన శైవక్షేత్రాలు
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో పార్వతీశ్వరుడు



సీతంపేటలో ముస్తాబైన పార్వతీశ్వరాలయం



రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయంలో విద్యుద్దీపాలంకరణ

సీతంపేట: మహాశివరాత్రి వేడుకలకు నియోజకవర్గంలోని శివాలయాలన్నీ చూడముచ్చటగా ముస్తాబయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం కావడంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూలదండలు, మామిడాకుల తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాలను అందంగా అలంకరించారు.



లలితా పీఠం మణిద్వీపంలో శివలింగం

విశేష పూజా కార్యక్రమాలు

నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయం, సీతంపేట పార్వతీశ్వరాలయంలో మహాశివరాత్రి రోజున విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాభాయి తెలిపారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి ఏకవార అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు చెప్పారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ కాలంలో భక్తులగోత్ర నామాలతో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. శంకరమఠం, జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

లలితా పీఠంలో హోమాలు

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో మహాశివరాత్రి రోజు తెల్లవారుజాము నుంచి శివలింగానికి అభిషేకాలు, ఉదయం 9 గంటల నుంచి అఘోర పాశుపత హోమం, రాత్రి 9 గంటలకు కాళీ కాల భైరవులకు మహాన్యసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు. హోమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



మూలవిరాట్ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం, బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు శివపార్వతుల మూలవిరాట్ విగ్రహాలను నక్కవానిపాలెం, క్రాంతినగర్ ప్రాంతాల్లో ఊరేగించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కు పల్లకీ తిరువీధి, నాదస్వరం, గరిడి, కోలాటం సేవలతో మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ట్రస్ట్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, శాస్త్రి, నక్క నాగమణి, నక్క జ్యోతి, అప్పల నర్సమ్మ, సంతోషిభాయి పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు ఉదయం, సాయంత్రం అమ్మవారిని పసుపు, కొత్తచీర, పలు రకాల పుష్పాలతో అలంకరించి పసుపు నీటితో జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోలో 'జ్ఞాననికేతన్'కు ద్వితీయ స్థానం



ద్వితీయ బహుమతి అందుకుంటున్న జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు

సీతంపేట: రాష్ట్రస్థాయి ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఎక్స్‌పో 2024 పోటీలో అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు.. రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం విశేషం. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాననికేతన్ ఎయిడెడ్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు కార్తీక్, చైతన్య, బెనర్జీలు చేసిన ప్రదర్శనకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ అభినందించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామాను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నరేష్‌కుమార్, కోనాడ సుదర్శన్

కంచరపాలెం: ప్లాస్టిక్ రహితంగా విశాఖను మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సివిల్ అండ్ లీగల్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అనుమతితో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే దిశగా కమిటీ చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయమన్నారు. జీవీఎంసీ 98 వార్డుల్లో చిరువ్యాపారులు, హోటళ్లు, పాఠశాలలు, రెస్టారెంట్ యజమానులకు ప్లాస్టిక్ రహిత సమాజంపై అవగాహన కల్పించేందుకు తలపెట్టిన ఈ కార్యక్రమం జయప్రదం కావడానికి వార్డు శానిటరీ సిబ్బంది సహాయ సహకారాలను అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జెస్సీ డెఫోర, కార్యదర్శి కోనాడ సుదర్శన్, కోన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

ఏయూ క్యాంపస్: యువతరం ఆశయం దిశగా అడుగులు వేయాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన జియో ఫిజిక్స్ విభాగం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో ప్రతి విద్యార్థి ప్రతిభావంతుడేనన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా యువతరం ఎదగాలని పిలుపునిచ్చారు. ఏయూలో స్టార్టప్ ఇంక్యుబేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేశామని, వీటిలో 152 సంస్థలు పనిచేస్తూ 7 వేల మందికిపైగా ఉపాధి కల్పించాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.శ్రీకృష్ణ, విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య పి.రాజేంద్రప్రసాద్, నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాళ్లు

ఏయూ క్యాంపస్: ఉన్నత విద్యతో మహిళా సాధికారత సాకారం అవుతుందని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అన్నారు. ఏయూ దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ ఓ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులుగా మారుతారన్నారు. లీ ఫార్మా నిర్వాహకురాలు లీలారాణి మాట్లాడుతూ మహిళలకు విద్య చాలా అవసరమన్నారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుధా పద్మశ్రీ మాట్లాడుతూ చదువుపై నిరుత్సాహం చూపవద్దని సూచించారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఆచార్య నందినీ మాట్లాడుతూ యువత వివాహం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని, ఉన్నత విద్య, వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని వివాహం చేసుకోవాలన్నారు. ఈ. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య పల్లవి, క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, డాక్టర్ పి.ఉష, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి అలరించారు.

ఘోషాస్పత్రి ఏవోగా నారాయణరావు

మహారాణిపేట: ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పరిపాలనాధికారిగా పని చేసిన సన్యాసినాయుడు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేశారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పదోన్నతిపై విక్టోరియా ఆస్పత్రి పరిపాలనాధికారిగా నియమించారు. గెజిటెడ్ హోదా రావడంతో నారాయణరావును వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి కార్యాలయ సిబ్బంది అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ (ఇన్‌చార్జి)గా సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించారు.

విజయవంతంగా యూత్ ఫెస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: యూత్‌ఫెస్ట్ నిర్వహణతో ఏయూ సత్తాను చాటారని, భవిష్యత్తులో ఆల్ ఇండియా యూనివర్సిటీ యూత్ ఫెస్ట్‌ని నిర్వహిస్తామని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఏయూలో జనవరిలో నిర్వహించిన యువభేరీ సౌత్ జోన్ యూత్ ఫెస్ట్ విజయోత్సవాన్ని టీఎల్ఎన్ సభామందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువభేరి విజయవంతం కావడంలో ఏయూ విద్యార్థి వలంటీర్ల కృషి నిరుపమానమన్నారు. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు, వసతి, భోజనం వంటివి ఏర్పాట్లు చేసిన ఆచార్య ఎస్.విజయమోహన్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య పల్లవి, దర్శకులు మహేంద్ర చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డీన్ ఆచార్య కె.బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతికి అండగా ఆర్పీఎఫ్



కవితాకుమారిని ఆదిత్యకు అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జార్ఖండ్‌కు చెందిన యువతి కవితాకుమారి(21)ని ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడి.. తనకు కాబోయే భర్త ఆదిత్యకు అప్పగించారు. వివరాలివీ.. కవితాకుమారి తల్లిదండ్రులు ఆమె చిన్నప్పుడే చనిపోయారు. అప్పటి నుంచి దగ్గర బంధువుల వద్ద ఆమె పెరిగింది. ఇటీవల కాలంలో వారి వేధింపులు ఎక్కువ కావడంతో అక్కడ నుంచి పారిపోయి ఈ నెల 3న విశాఖపట్నం వచ్చేసింది. విశాఖ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఆమెను ఆర్పీఎఫ్ గుర్తించింది. ఆమె సంరక్షణ నిమిత్తం ఏయూటీడీ హోమ్‌లో చేర్పించారు. యువతి నుంచి వివరాలు సేకరించి.. తనకు కాబోయే భర్త ఆదిత్యకు తెలిపారు. అతను బుధవారం విశాఖ రాగా.. ఆమెను అతడికి అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



బూత్ కమిటీలతో సమావేశమైన సమన్వయకర్త కె.కె.రాజు

'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో బుధవారం 42, 49 వార్డులకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి ఓటు వైఎస్సార్‌సీపీకే పడేలా కృషిచేయాలని కోరారు. ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు వెచ్చించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బగాతి విజయ్, మండల కన్వీనర్ బులుసు జగదీష్, నీలి రవి, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'



వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి వెంటనే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామన్నారు.

పోలీస్ స్టేషన్లలో 'ప్రత్యేక స్పందన'

భూకబ్జాలపై ఫిర్యాదుల స్వీకరణ



బాధితుడి ఫిర్యాదును పరిశీలిస్తున్న ఈస్ట్ ఏసీపీ జయరాం ప్రసాద్



తమ భూమి కబ్జాకు గురైందని ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న మహిళ

సీతమ్మధార: భూకబ్జాలు, వివాదాలపై నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఉక్కుపాదం మోపారు. ఆయన ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈస్ట్ ఏసీపీ మోహర్ జయరాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్పందన(స్పెషల్ డ్రైవ్) కార్యక్రమం నిర్వహించారు. భూకబ్జాల బారిన పడిన పలువురు స్వయంగా ఏసీపీకి ఫిర్యాదులు చేశారు. బాధితులు ఒక్కొక్కరితో ఆయన మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లలితానగర్‌లోని తమ స్థలాన్ని కబ్జా చేశారని రాజ్యలక్ష్మి అనే మహిళ ఏసీపీ జయరాం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను ఆయన పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే, భూకబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీయిజం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సీఐ విజయకుమార్, ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్పందన నిర్వహించారు. సీఐ విశ్వేశ్వరరావుతో కలిసి ఆయన భూకబ్జాలపై ఫిర్యాదులు స్వీకరించారు. సీతంపేట నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఇరు పార్టీలను పిలిపించి మాట్లాడారు.

ట్రాఫిక్ నియంత్రణకు బడ్డీల తొలగింపు



సీతమ్మధార ప్రధాన రహదారిలో బడ్డీలను తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బుధవారం ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడుబళ్లు, పండ్లు విక్రయించే బళ్లు, టిఫిన్ కొట్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావు మాట్లాడుతూ సత్యం జంక్షన్ నుంచి ఇరువైపులా తోపుడుబళ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొన్న నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు ఏ సమస్యా లేకుండా క్లియర్ చేసినట్లు తెలిపారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాలు రాకపోకలు ఎక్కువై ట్రాఫిక్ జామ్ కావడంతో ఈ కార్యక్రమం చేట్టినట్లు చెప్పారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వాసుపల్లి, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం: జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా జరిగింది. నూతన ధర్మకర్తలుగా లండ రమణ, చుక్క శ్యామ్ సుందర్‌రెడ్డి, కోశెట్టి దేవి, ఎలమలశెట్టి దేవి, కర్రి ధనయమ్మ, కుంచపు ఆదినారాయణ, వాసుపల్లి నారాయణరావు, కణిత గౌరీ, కె.తేజారత్నం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఈవో డీవీఎస్ సురేష్‌బాబాను అభినందించారు. ఇటీవల ఆలయ అభివృద్ధికి సంబంధించి తప్పుడు రాతలు రాస్తున్న ఎల్లో మీడియాను దుయ్యబట్టారు. ఆలయాభివృద్ధికి, భక్తుల వసతుల కల్పనకు కృషి చేయాలని ధర్మకర్తల మండలి సభ్యులకు సూచించారు. అనంతరం సభ్యులు లండ వెంకటరమణను ఆలయ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి కె.శిరీష, ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.